## క్లుప్తంగా

### ప్రజలతోనే రాజన్నదొర

సాలూరు రూరల్: ఎన్నికలు ముగిసిన రోజు నుంచి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర సాలూరులోని తన ఇంటివద్దనే ఉంటున్నారు. నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలతో ముచ్చటిస్తున్నారు. వివిధ సమస్యల పరిష్కారానికి చొరవచూపుతున్నారు.

### చినబోగిలిలో ఇంటింటికీ కుళాయి



చినబోగిలిలో ట్యాప్‌లతో నీరు విడుదల చేస్తున్న నిర్వాహకులు

సీతానగరం: జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన ఇంటింటికీ కుళాయి నిర్మాణ పనులు చాలా గ్రామాల్లో చివరిదశకు చేరాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. చినబోగిలిలో జరుగుతున్న కుళాయి పనులను శుక్రవారం పరిశీలించారు. చిన్నచిన్న పనులు మిగిలి ఉన్నాయని, అవి పూర్తికాగానే 569 ఇళ్లకు తాగునీరు సరఫరా అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

### గొడవలు పడొద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ నారాయణరావు

పాచిపెంట: ఎన్నికల నేపథ్యంలో ఏ ఒక్కరూ గొడవల్లో తలదూర్చకూడదని, అల్లర్లు సృష్టించే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ నారాయణరావు అన్నారు. వచ్చేనెల 4వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. మండలంలోని పూడి గ్రామస్తులతో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రెచ్చగొట్టే మెసేజ్‌లు, వ్యాఖ్యలు చేసేవారిపై నిఘా పెట్టామన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని కోరారు.

### 104 శిబిరాల్లో మెరుగైన వైద్యం

సీతానగరం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతినెలా నిర్వహించే 104 శిబిరాల్లో అందించే మెరుగైన వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సీతానగరంలోని రౌండ్ ది క్లాక్ పీహెచ్‌సీ డాక్టర్ బి.పావని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో వైద్యుడు ప్రభుదేవ్‌తో కలిసి ఆమె శుక్రవారం మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ (సీహెచ్‌ఓ)ఆఫీసర్ ఎస్.వి.రమణ, హెల్త్‌సూపర్‌వైజర్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

### ఖరీఫ్‌కు సన్నద్ధం



ఆర్‌బీకేలకు చేరుతున్న విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ

పాచిపెంట: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీకి సన్నద్ధమవుతున్నట్టు ఏఓ తిరుపతిరావు తెలిపారు. పనుకువలస, కొనవలస ఆర్‌బీకేల వద్ద రైతులతో శుక్రవారం మాట్లాడారు. భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువులను సాగుచేయాలని సూచించారు. 50 శాతం రాయితీపై విత్తనాలు అందజేస్తున్నామని చెప్పారు. ఖరీఫ్ సాగుకు వరి విత్తనాలు, ఎరువులు జూన్ మొదటి వారం నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు.

### 29న మండల పరిషత్ సమావేశం

సీతంపేట: మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో ఈ నెల 29న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.గీతాంజలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు జరగనున్న సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

### ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయంతో అత్యధిక దిగుబడులు సాధించవచ్చని ఆ శాఖ రీజనల్ అధికారి ప్రకాష్ అన్నారు. మండలంలోని దారిమల్లి, దిబ్బగూడ రైతుల పొలాల్లో శుక్రవారం నవధాన్యాల విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత మోతాదులో నవధాన్యాలు చల్లడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. అనంతరం పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. నవధాన్యాల కిట్లు తయారు చేయించి రైతులకు పంపిణీ చేయాల ని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీపీఎం షణ్ముఖరాజు, హేమసుందర్, బాలు పాల్గొన్నారు.

# అప్రమత్తతతోనే వ్యాధులు దూరం..



గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న గ్రామీణ పశువైద్య సహాయకులు

- లేగ దూడలకు టీకాలు వేయాలి
- పశు సంవర్థక శాఖ జె.డి శివ్వాల మన్మధరావు

పాలకొండ రూరల్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు లేగ దూడలకు గొంతు, జబ్బ వాపు, గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వంటి ప్రమాదకరమైన అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంది. పెంపకందారులు అప్రమత్తంగా వ్యవహరించి దూడలకు వైద్యం అందించకపోతే ప్రాణనష్టం కూడా జరగవచ్చు. ఈ నేపథ్యంలో లేగదూడలకు సోకే అంటువ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, అందించాల్సిన టీకాలపై పలు విషయాలు వెల్లడించారు. అంటువ్యాధులు సోకిన లేగదూడలకు సకాలంలో చికిత్స అందించాలి. ముఖ్యంగా గాలికుంటు వంటి వ్యాధులు సోకినపుడు అవి శక్తిని కోల్పోయి, నీరసించి పోతాయి. గొంతువాపు, చీడపారుడు, దొమ్మ వంటి అంటువ్యాధులు సోకిన లేగదూడల్లో మరణాల శాతం అధికంగా ఉంటుంది. జబ్బవాపు వ్యాధి సోకితే కండరాలు కుళ్లిపోవడం ద్వారా పశువులు నడవలేవు. పడ్డలు, పెయ్యలు చూడి కట్టి ఈనే సమయంలో బ్రూసెల్లోసిస్ వ్యాధి ప్రభావం వల్ల గర్భస్రావాలు జరుగుతాయి.

**టీకాలు తప్పనిసరి..**

వైద్యుల సలహా మేరకు ఉచితంగా లేదా తక్కువ ఖరీదుతో లభ్యమయ్యే టీకాలను లేగదూడలన్నింటికీ వేయాలి. టీకాలు వేయించేముందు లేగదూడల్లో అంతర్ పరాన్నజీవుల నిర్మూలన మందులు తాగించాలి. టీకాలు మోతాదు, పశువుల ఆరోగ్య పరిస్థితి వంటి విషయాల్లో వైద్యుల సలహాలు తీసుకోవాలి. టీకాలు వేయించడం వల్ల లేగదూడల్లో జ్వరం, దాణా తినకపోవడం, టీకాలు వేసిన స్థలంలో వాపు ఏర్పడడం వంటి లక్షణాలు కనిపించినా కంగారు పడనవసరం లేదు. దూడల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని టీకాలు వేయించి ప్రాణాంతకమైన అంటువ్యాధుల నుంచి రక్షణ కల్పించాలి. బ్రూసెల్లోసిస్ తప్ప మిగతా టీకాలన్నీ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా వేయిస్తుండాలి. గొంతువాపు, జబ్బవాపు వ్యాధులు రెండింటి నివారణకు 'రక్ష బయోవాక్' పేరుతో ఒకే టీకామందు అందుబాటులో ఉంది. అలాగే గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వ్యాధి మూడింటి నివారణకు 'రక్ష ట్రయోవాక్' పేరుతో ఒకే టీకామందు మార్కెట్లో లభిస్తోంది. ఈ టీకాను మొదటిసారి నాలుగు మాసాలకు, ఆ తర్వాత తొమ్మిది మాసాలకు బూస్టర్ డోస్ వేయించాలి.

**సమతుల ఆహారం..**

చూడితో ఉన్న పశువులకు చివర మూడు మాసాలు పుష్టిగా సమతులాహారం అందించడం వల్ల పుట్టిన లేగదూడలు దృఢంగా,ఆరోగ్యంగా పుడతాయి. పుట్టిన దూడలకు సమృద్ధిగా జున్నుపాలు తాగనివ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

**దూడల్లో టీకాల నియమావళి....**

| అంటువ్యాధి పేరు | టీకాలు వేయించాల్సిన వయస్సు | బూస్టర్ డోస్ |
|---|---|---|
| గాలికుంటువ్యాధి | 1-2 మాసాలు | 30-40 రోజుల తర్వాత |
| గొంతువాపు వ్యాధి | 5వ నెల | 30-40 రోజుల తర్వాత |
| జబ్బవాపు వ్యాధి | 6వ నెల | 30-40 రోజుల తర్వాత |
| బ్రూసెల్లోసిస్ | 4, 8వ నెలలు | - |
| థైలేరియాసిస్ వ్యాధి | 4వ నెల | - |
| దొమ్మ వ్యాధి | 7వ నెల | - |
| శ్వాసకోశ వ్యాధి | 1-1/2 నెల | 3వ నెల |



దూడలకు నోటిద్వారా మందులు అందిస్తున్న వైద్యాధికారులు

**పాడి రైతులకు అండగా..**

పాడి రైతుకు అండగా ఉంటున్నాం. 38 వెటర్నరీ డిస్పెన్సరీలు, గ్రామీణ పశువైద్య కేంద్రాలు, 140 రైతుభరోసా కేంద్రాల ద్వారా బీ-క్యూ జబ్బవాపు టీకాలు వేయాల్సిన లక్ష్యం 27,990 కాగా ఇప్పటివరకు లక్ష్యానికి మించి 28 వేల పైచిలుకు టీకాలు వేశాం. గొర్రెల్లో చిటుకు వ్యాధి నివారణకు 1,49,200 టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇంతవరకు 1,16,147 డోసులు వేశాం.

శివ్వాల మన్మధరావు, పశుసంవర్థక శాఖ జె.డి., పార్వతీపురం మన్యం

# బాలగుడబలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పల్లె ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. బాలగుడబ గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు వైద్యసేవలు అందిస్తున్నామని, శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాదాపు 13 రకాల వైద్య సేవలు, 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



బాలగుడబలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

# రైతులకు అండగా మామిడిపల్లి పీఏసీఎస్

- రూ.8 కోట్ల రుణాలు మంజూరు
- 2024-2025కు రూ.50 లక్షల రుణ ప్రణాళిక
- మామిడిపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు పెద్దింటి మాధవరావు



సాలూరు రూరల్:

మామిడిపల్లి పీఏసీఎస్ రైతులకు అన్ని రకాల సేవలు అందించడంలో ముందంజలో ఉందని, ఇప్పటికే రూ.8 కోట్ల మేర రుణాలు రైతులకు మంజూరు చేసినట్టు పీఏసీఎస్ అధ్యక్షుడు పెద్దింటి మాధవరావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమకూర్చుతున్నామన్నారు. రైతుల రుణాలను ఏటా రెన్యువల్ చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ ఏడాది మరో రూ.50 లక్షల మేర అదనంగా రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. సహకార సంఘం పరిధిలో 18 పంచాయతీలు ఉండగా, 300 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారన్నారు. పీఏసీఎస్‌కు కొత్త భవనం నిర్మాణానికి ఏపీ కార్పొరేషన్ బ్యాంకు రూ.20 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. ఇందులో 20 శాతం నిధులను సొసైటీ భరిస్తుందన్నారు. భవన నిర్మాణానికి తాడుతూరి తిరుపతిరావు 4 సెంట్లు స్థలం ఇచ్చారన్నారు.

# 90 శాతం రాయితీపై వరి విత్తనాల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఏవో సీహెచ్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఎల్విన్‌పేట రైతు భరోసా కేంద్రంలో పలువురు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలను పంట పొలాల్లో సాగుచేసుకుని కలియదున్నడం ద్వారా ప్రధాన పంటలకు అవసరమైన పోషకాలు విస్తారంగా లభిస్తాయని, ఫలితంగా పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయయన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వరి 1200 క్వింటాళ్లు, రాగులు 11 క్వింటాళ్లు, కొర్రలు 3.5 క్వింటాళ్ల చొప్పున గుమ్మలక్ష్మీపురం మండలానికి అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపించామని, అవి వచ్చిన వెంటనే రైతులకు అందజేయడం ప్రారంభిస్తామని తెలిపారు.



పచ్చిరొట్ట విత్తనాలు అందుకున్న రైతులతో ఏవో ప్రసాద్

# నేత్ర శస్త్రచికిత్సకు 40 మంది పయనం

కురుపాం: నేత్ర శస్త్రచికిత్సకు ఎంపికైన 40 మంది స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి శుక్రవారం పయనమై(బయలుదేరి) వెళ్లినట్లు పార్వతీపురం మన్యం జిల్లా కంటి వెలుగు కార్యక్రమ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. కురుపాం మండలంతో పాటు గుమ్మలక్ష్మీపురం మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన నేత్ర వైద్యశిబిరాల్లో అంతర కుసుమం, కొయ్యకండ వంటి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించామన్నారు. వారందరికీ ఇప్పుడు ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు ప్రత్యేక బస్సులో కంటి ఆస్పత్రికి తరలించామన్నారు. ఆపరేషన్లు చేయించుకుంటున్న వారికి ఉచిత వసతి, రవాణా సదుపాయాలతో పాటు కళ్లద్దాలు, మందులు కూడా ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు.



కంటి ఆపరేషన్లకు బయలుదేరిన వారితో వైద్య సిబ్బంది

# ప్లాస్టిక్ వినియోగం తగదు

పాలకొండ రూరల్: పాలిథిన్ ఉత్పత్తులు, ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని నగర కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాల సీజన్‌లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలన్నారు.

### సాలూరులో రాజన్నగెలుపు ఖాయం

సాలూరు/సాలూరు రూరల్: సాలూరు ఎమ్మెల్యేగా రాజన్నదొర గెలుపు ఖాయమని వైఎస్సార్‌సీపీ సాలూరు పట్టణ నాయకులు మద్దిల గోవింద, హరిబాలాజీ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సువ్వాడ రామకృష్ణ అన్నారు. ఐదేళ్ల పాటు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పాలనే విజయాన్ని అందిస్తుందన్నారు. రాజన్నదొర ఉన్నత వ్యక్తిత్వానికి ఓట్ల వర్షం కురిసిందన్నారు. పట్టణంలో పెదబజారు విషయంలో ఆర్య వైశ్యులకు రాజన్నదొర అండగా నిలిచారన్నారు. వంద పడకల ఆస్పత్రి, బైపాస్ రోడ్డు పూర్తి చేయించడం, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించడంలో రాజన్నదొర కృషి ఎనలేనిదన్నారు.

### పశువుల పెంపకంపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి: పాడిపశువుల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని పశు సంవర్థక శాఖ వైద్యుడు సురేష్‌కుమార్ సూచించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవా రం మాట్లాడుతూ వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువుల్లో ఆరోగ్యం, పునరుత్పత్తి, ఉత్పాదక సామర్థ్యం సమస్యలు తలెత్తుతాయన్నారు. 38 డిగ్రీల ఉష్ణోగ్రత పశువులకు సౌకర్యవంతమని, అంతకుమించితే పశువుల్లో రకరకాల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ప్రధానంగా పాల ఉత్ప త్తి, వెన్నశాతం తగ్గడం జరుగుతుందన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులకు ఊపిరి పీల్చుకోవడం కష్టతరమవుతుందని, దీంతో ఫిట్స్ కూడా రావొచ్చన్నారు.

# సాగు సేవలు అందిద్దాం

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల తీర్మానం

మక్కువ: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తదితర సాగు సేవలు అందిద్దామని మండల సర్వసభ్యసమావేశంలో సభ్యులు తీర్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతిని వివరించారు. ఎన్నికలకోడ్ అమల్లో ఉండడంతో మండలాభివృద్ధి పనులపై ఎటువంటి చర్చ జరగలేదు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా విత్తనాలు, ఎరువులు అందించాలని ఎంపీపీ పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు వ్యవసాయాధికారి శ్రీనివాసరావుకు సూచించారు. గతంలో దుగ్గేరు గ్రామం నుంచి, రావులపాలేం పట్టణానికి ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ బస్సును ఉదయం వేళల్లో నడిపించేవారని, కొంతకాలంగా బస్సును నిలుపుదలచేయడంతో సుదూరప్రాంతాలకు వెళ్లేందుకు మండల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు సభ్యులు తెలిపారు. మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులు, విద్యుత్‌శాఖ పనితీరు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీపై సభ్యులు, అధికారులు చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.దేవకుమార్, ఉప తహసీల్దార్ జి.హేమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, వెలుగు ఏపీఎం సన్నిబాబు, ఏపీఓ ఈశ్వరమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ పారమ్మ, అధికారులు

# డ్రైడేతో దోమల నిర్మూలన



డ్రైడేపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్మోహన్‌రావు

- జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్మోహనరావు

పార్వతీపురంటౌన్: ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు అన్నారు. బాలగుడబలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇంటి పరిసరాలు, వీధుల్లో దోమల లార్వా వృద్ధి చెందే ప్రదేశాల్లో విధిగా మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. మలేరియా, డెంగీ తదితర జ్వరాలకు దోమలే కారణమన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది రామలక్ష్మి శ్రీధర్, జగదీష్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలు సిద్ధం

సీతానగరం: రైతులకు అందజేసేందుకు ఆర్‌బీకేలలో వరి విత్తనాలు సిద్ధం చేస్తున్నామని ఏఓ ఎస్. అవినాష్ తెలిపారు. ఎంటీయూ-1064, ఎంటీయూ-1121, ఆర్‌జేఎల్-2532, బీపీటీ -5204, బీపీటీ-3291 రకాలకు చెందిన 2,020 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రతిపాదనలు పంపించగా, ఇప్పటి వరకు ఎంటీయూ-1064, ఎంటీయూ-1121, ఆర్‌జేఎల్ విత్తనాలు ఆర్బీకేలకు వచ్చాయని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై విక్రయిస్తున్నామన్నారు. జీలుగులు విత్తనాలు 10 కేజీల బ్యాగ్ పూర్తి ధర రూ.880లు కాగా రాయితీపై రూ.440కు, కట్టెజనుము 10 కేజీల ప్యాకెట్ రూ.880కాగా రాయితీపై రూ.440కు, పిల్లిపెసర 8 కేజీల పూర్తి ధర రూ.1,072లు కాగా రాయితీపై రూ.536కు విక్రయిస్తున్నామన్నారు. మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 120 క్వింటాళ్ల కట్టె జనుము, 160 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆయన వెంట సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ జగదీశ్వరరావు, ఆశ ఉన్నారు.



ఆర్.వెంకంపేట ఆర్‌బీకేకు చేరిన వరి విత్తనాలు



కాశీపేటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

# నిఘా నీడలో గ్రామాలు

వీరఘట్టం: ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. ఎన్నికల రోజు కొన్ని గ్రామాల్లో స్వల్ప వాగ్వాదాలు మినహా మండల వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జూన్ నాలుగో తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనుండడంతో రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పోలీస్ యంత్రాంగం ముమ్మర చర్యలు చేపట్టింది. డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ కొన్ని రోజులుగా ప్రతి గ్రామంలో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బెట్టింగ్‌లకు పాల్పడినా, కవ్వింపు చర్యలతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించినా చర్యలు తప్పవన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా పోలీస్ సిబ్బంది గ్రామాలపై నిఘా వేయడంతో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రశాంతంగా ఉన్నారు. ఎస్సై ఫక్రుద్దీన్ నడుకూరు, వీరఘట్టంలోని పలు వీధుల్లో శుక్రవారాం పర్యటించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా తిరగకూడదని సూచించారు.

**పికెట్ కొనసాగింపు..**

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చోటు చేసుకున్న స్వల్ప సమస్యలను దృష్టిలో పెట్టుకుని పాలకొండ పోలీసులు స్థానిక పెద్దకాపు వీధి సమీపంలో ఏర్పాటు చేసిన పికెట్ కొనసాగిస్తున్నట్లు సీఐ మీసాల చంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలసి సమీప ప్రాంతాల ప్రజలతో శుక్రవారం మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో సామరస్యపూర్వకంగా మెలగాలని సూచించారు. గ్రామాల్లో సెక్షన్ 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా హద్దుమీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



తలవరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కృష్ణారావు, పక్కనే ఉన్న సీఐ చంద్రమౌళి, ఎస్సై ఫక్రుద్దీన్

**గొడవలకు దూరంగా ఉండండి**

జియ్యమ్మవలస: ప్రతిఒక్కరూ గొడవలకు దూరంగా ఉండి, ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించాలని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు కోరారు. మండలంలోని చినమేరంగి గ్రామానికి శుక్రవారం వెళ్లిన ఆయన అక్కడి గ్రామస్తులతో సమావేశమై, ఎన్నికల నిబంధనలు వివరించారు. జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయని, ఈ ఫలితాల నేపథ్యంలో ఎవరూ తగాదాలకు పాల్పడవద్దని, వివాదాస్పద వ్యాఖలు చేసుకోవద్దని సూచించారు. ఏ పార్టీ వారైనా గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, సంయమనం పాటించాలని కోరారు. ఎవరైనా వివాదాల జోలికి వెళితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత తగాదాలకు దిగి, బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో చినమేరంగి సీఐ మంగరాజు, ఎస్‌ఐ చిన్నంనాయుడు ఉన్నారు.



జియ్యమ్మవలస: గ్రామస్తులకు సూచనలిస్తున్న పాలకొండ డీఎస్పీ కృష్ణారావు



పాలకొండ రూరల్: పెద్దకాపువీదిలో యువతతో మాట్లడుతున్న సీఐ, ఎస్సై